బాధితులకు తెలిసిన వారు లేక చుట్టుపక్కల నివసించే వారే ఉంటున్నారు. ఈ దారుణాలు ఇంటి గుమ్మం దాటకముందే జరుగుతుండటం సమాజంలో నెలకొన్న నైతిక పతనాన్ని సూచిస్తోంది. ఖమ్మం నగరంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన దాడి ఘటన అత్యంత క్రూరత్వానికి పరాకాష్టగా నిలిచింది. 49 ఏళ్ల మహమ్మద్ గౌస్ అనే వ్యక్తి, అపార్ట్‌మెంట్‌లో సాధారణ వ్యక్తిగా నటిస్తూనే ఈ దారుణానికి ఒడిగట్టాడు. బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించడమే కాకుండా, తనను తాను కాపాడుకోవడానికి పాపను మూడవ అంతస్తుపై నుంచి కిందకు విసిరేశాడు. తీవ్ర గాయాలపాలైన బాలిక ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. జూన్ 6న జరిగిన ఈ ఘటన, ఆ చిన్నారి తనను ఎవరో కిందకు తోసేశారని వెల్లడించిన తర్వాతే పోలీసులకు స్పష్టత వచ్చింది. ఘటన జరిగిన వారం రోజుల ముందే నిందితుడు బాలికను అసభ్యంగా తాకాడు. అప్పుడే తల్లి స్థానికులకు ఫిర్యాదు చేసినా, వారు బాధ్యతాయుతంగా స్పందించకుండా కేవలం పాపను జాగ్రత్తగా చూసుకోమని సూచించడం వంటి నిర్లక్ష్య వైఖరులే నేరస్తులకు వరంగా మారుతున్నాయి. ఈ కేసులో నిందితుడిని ఖమ్మం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిపై పోక్సో మరియు హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. స్థానికంగా అధికార బీఆర్ఎస్ పార్టీతో సంబంధాలు ఉన్నట్లుగా ప్రచారంలో ఉన్న ఈ వ్యక్తి, ప్రస్తుతం జైలులో విచారణ ఎదుర్కొంటున్నాడు. చట్టపరంగా ఇతనికి 20 ఏళ్లకు పైగా కఠిన కారాగార శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. రజక సామాజిక వర్గానికి చెందిన బాధితురాలికి న్యాయం చేయాలని స్థానిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నాయి. వ్యవస్థలు కఠినంగా వ్యవహరిస్తేనే ఇలాంటి మృగాలకు భయం కలుగుతుంది. నిందితుడు ఎంతటి బలవంతుడైనా చట్టం ముందు సమానమే అని నిరూపించాల్సిన బాధ్యత పోలీసుల మీద ఉంది. లేని పక్షంలో ఇలాంటి ఘటనలు మరింతగా పునరావృతమయ్యే ప్రమాదం పొంచి ఉంది. బాధిత బాలికా వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడం చట్టరీత్యా నేరం. పోక్సో చట్టం ప్రకారం బాధితుల గుర్తింపు బయటకు రాకుండా చూడాల్సిన బాధ్యత సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు అందరిపై ఉంది. కొందరు తమ ప్రయోజనాల కోసం, రాజకీయ కారణాల వల్ల బాలిక తల్లిదండ్రుల వీడియోలను కూడా వైరల్ చేస్తున్నారు. ఇటువంటి చర్యలు బాధితులకు మానసికంగా కోలుకోలేని క్షోభను మిగుల్చుతాయి. కేవలం నిందితుడి మతాన్ని బట్టి స్పందించే ఈ తరహా రాజకీయ వైఖరి, అసలైన బాధితులకు తీరని అన్యాయం చేస్తోంది. బాధితురాలిని బ్లేమ్ చేసే నేరేటివ్స్ సృష్టించడం ద్వారా నిందితులను కాపాడటమే వీరి ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. బాధితుల పక్షాన నిలబడాలన్నా, అక్కడ నిందితుడు వేరే మతానికి చెందిన వాడై ఉండాలని కోరుకునే విపరీత మనస్తత్వం సమాజానికి ప్రమాదకరం. ఈ తరహా ప్రచారాల వెనుక లవ్ నాన్ హిందూ అక్యూస్డ్ సిండ్రోమ్ అనే మతోన్మాద వైరస్ ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వైరస్ సోకిన వారు నేరాన్ని కాకుండా, నిందితుడి కులం లేక మతాన్ని బట్టి మాత్రమే స్పందిస్తుంటారు. బండి భగీరథ్ కేసులో నిందితుడిని రక్షించడానికి ప్రయత్నించిన వారు, ఇప్పుడు ఈ ఘటనలో నిందితుడి మతాన్ని చూసి మరోలా స్పందిస్తున్నారు. ఇవి రెండు భిన్నమైన పరిస్థితులు. ఒక కేసులో నిందితుడికి రాజకీయ అండదండలు ఉండటంతో వ్యవస్థలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించాయి. కానీ ఖమ్మం కేసులో పోలీసులు వెంటనే స్పందించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇక్కడ కేవలం మతపరమైన అంశాలనే తెరపైకి తీసుకురావడం ద్వారా నేరస్థుడికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నట్లుగా మారుతోంది. ఏ నేరానికైనా మతం రంగు పులమడం నేరస్తులను సమర్థించుకోవడమే అవుతుంది. పోక్సో కేసులు నమోదు కావడం సులభమే కానీ, వాటిలో శిక్ష పడటం చాలా అరుదుగా మారుతోంది. తెలంగాణలో పిల్లలపై జరిగే నేరాల్లో పోక్సో కేసులే 15 శాతం వరకు ఉంటున్నాయి. దురదృష్టవశాత్తూ వీటిలో కేవలం 7 శాతం కేసుల్లోనే నేరస్తులకు శిక్షలు పడుతున్నాయి. మిగిలిన 93 శాతం కేసుల్లో బాధిత కుటుంబాలు న్యాయం కోసం ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 8900 వరకు పోక్సో కేసులు పెండింగ్‌లో ఉండటం న్యాయ వ్యవస్థలోని లోపాలను సూచిస్తోంది. న్యాయం ఆలస్యం కావడం అంటే, అన్యాయం జరిగినట్లే లెక్క. పెండింగ్ కేసుల భారం తగ్గించకపోతే బాధితులకు మనోధైర్యం దెబ్బతింటుంది.

# పల్లెల్లో పొంగుతున్న మద్యం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై మద్యం ఏరులై పారుతోంది. పల్లె మొదలు పట్టణం వరకు విచ్చలవిడిగా వెలసిన అమ్మకపు కేంద్రాలు సామాన్యుల జీవితాలను మద్యం మత్తులో ముంచెత్తుతున్నాయి. రాష్ట్ర ఖజానాకు చేకూరే ఆదాయంపైనే పాలకులు అధికంగా ఆధారపడుతుండటంతో, ప్రజల ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులు ఛిద్రమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మద్యం తయారీదారులు, విక్రయదారులు భారీ లాభాలు గడిస్తుండగా, క్షేత్రస్థాయిలో అనధికారికంగా సాగుతున్న దుకాణాల ముడుపులు అధికార వర్గాలకు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏటా సుమారు 80 వేల కోట్ల నుండి లక్ష కోట్ల రూపాయల విలువైన అమ్మకాలు రాష్ట్రంలో జరుగుతున్నాయని అంచనా. ఈ వాణిజ్యం ద్వారా ప్రభుత్వానికి ఎక్సైజ్ సుంకం, ప్రత్యేక సెస్, అదనపు లేవీ, లైసెన్స్ ఫీజు రూపంలో భారీగా ఆదాయం సమకూరుతోంది. తెలంగాణ ఏర్పడిన 201415 సంవత్సరంలో ఎక్సైజ్ ఆదాయం పది వేల కోట్ల రూపాయలుగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అది 40 వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. ఇది నాలుగు వందల శాతం పెరుగుదలను సూచిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే 95,628 దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖ అదనంగా రెండు వేల ఎనిమిది వందల అరవై తొమ్మిది కోట్ల రూపాయలను ఆర్జించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,620 మద్యం దుకాణాలు, 1,214 బార్లు అధికారికంగా ఉండగా, వీటితో అధికారులు కుమ్మక్కై గ్రామస్థాయిలో వందలాది అనధికారిక విక్రయ కేంద్రాలను నడిపిస్తున్నారు. మంచినీటి చుక్క దొరకని మారుమూల గ్రామాల్లో సైతం చౌక మద్యం సులభంగా లభిస్తోంది. 202526 ఆర్థిక సంవత్సరంలో 382.91 లక్షల కేసుల మద్యం, 387.34 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిగాయి. మద్యం విక్రయాల విలువలో సింహభాగం ప్రభుత్వానికే చేరుతోంది. మెక్‌డోల్ నెంబర్ వన్ బ్రాండ్ బాటిల్ ధర 700 నుండి 900 రూపాయల మధ్య ఉండగా, అందులో ప్రభుత్వ పన్నులు 350 నుండి 550 రూపాయల వరకు ఉంటాయి. రాయల్ స్టాగ్ బాటిల్ ధర 900 నుండి 1,200 రూపాయలు ఉండగా, పన్నుల రూపంలో 450 నుండి 750 రూపాయలు ప్రభుత్వానికి వెళ్తున్నాయి. సిగ్నేచర్ మద్యంపై 600 నుండి 900 రూపాయల వరకు, బ్లెండర్స్ ప్రైడ్ బాటిల్ మీద 700 నుండి 1,100 రూపాయల వరకు పన్నులు వసూలవుతున్నాయి. ఒక్క ఎమ్మార్పీ ధరల లెక్కల ప్రకారం చూస్తే, మొత్తం 80 వేల నుండి లక్ష కోట్ల అమ్మకాల్లో ప్రభుత్వ వాటానే 44,557 కోట్ల రూపాయలుగా ఉంది. తయారీదారుల వాటా 15 వేల నుండి 24 వేల కోట్ల రూపాయలు, రిటైల్ హోల్‌సేల్ మార్జిన్లు నాలుగు వేల నుండి ఎనిమిది వేల కోట్ల రూపాయల వరకు ఉంటున్నాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 5 (201921) ప్రకారం దేశంలో మద్యం తాగేవారు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని పురుషుల్లో 50 శాతం మంది, మహిళల్లో 4.9 శాతం మంది మద్యం సేవించే అలవాటు కలిగి ఉన్నారు. సుమారు నాలుగు కోట్ల జనాభా కలిగిన రాష్ట్రంలో, దాదాపు 70 నుండి 90 లక్షల మంది మద్యం సేవించే వారిగా అంచనా. పల్లెల్లో 46 నుండి 49 శాతం, పట్టణాల్లో 34 నుండి 36 శాతం మంది పురుషులు మద్యం తాగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కొమురంభీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల్, నారాయణపేట జిల్లాలు మద్యం వినియోగంలో మొదటి పది స్థానాల్లో ఉన్నాయి. కుటుంబంలో ఒకరు మద్యం బానిసగా మారితే ఆ కుటుంబం ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తింటోంది. రోజుకు 200 రూపాయలు మద్యం కోసం ఖర్చు చేసే వ్యక్తి, ఏడాదికి 73 వేల రూపాయలు నష్టపోతున్నాడు. రోజువారీ కూలీలే ఎక్కువగా చీప్ లిక్కర్ బారిన పడుతుండటంతో, వారి పని సామర్థ్యం తగ్గి కుటుంబ ఆదాయం దెబ్బతింటోంది. అప్పులు చేయడం, గృహోపకరణాలు తాకట్టు పెట్టడం వంటి పనులతో ఆయా కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. 300 రూపాయలు మద్యం కోసం ఖర్చు చేస్తే ఏడాదికి లక్షా తొమ్మిది వేల రూపాయలు, 500 రూపాయలు ఖర్చు చేస్తే ఏడాదికి లక్షా ఎనభై రెండు వేల రూపాయలు నీటిపాలవుతున్నాయి. ఈ మొత్తానికి వడ్డీలను కలిపితే ఆర్థిక నష్టం రెట్టింపు అవుతుంది. రోజుకు 200 రూపాయలు పొదుపు చేస్తే ఏడాదికి 73 వేల రూపాయలు మిగులుతాయి. అదే సొమ్మును పది ఏళ్ల పాటు దాస్తే ఏడు లక్షల ముప్పై వేల రూపాయలు అవుతుంది. నెల నెలా తొమ్మిది వేల రూపాయలు మద్యం కోసం తగలేసే కుటుంబం, ఆ మొత్తాన్ని పొదుపు చేస్తే ఇరవై ఏళ్ల కాలానికి వడ్డీతో కలిసి సుమారు యాభై లక్షల రూపాయల వరకు సంపదగా మారే అవకాశం ఉంది. ఇదే సొమ్మును ఆస్తుల కొనుగోలుకు ఉపయోగిస్తే కోటి రూపాయల వరకు విలువ పెరిగే అవకాశం ఉండగా, పిల్లల విద్య కోసం ఖర్చు చేస్తే ఆ కుటుంబం ఉన్నత స్థానానికి ఎదిగే ఆస్కారం ఉంది. మద్యానికి బానిసైన వారు ఈ ప్రయోజనాలను కోల్పోతూ, ఆర్థిక అగాధంలోకి జారిపోతున్నారు. ప్రభుత్వాలు ఆదాయం కోసం ప్రజల ఆరోగ్యాలను పణంగా పెడుతున్నాయి. బెల్ట్ షాపుల ద్వారా విక్రయాలు పెంచడం వల్ల గ్రామాల్లోని యువత సైతం మద్యం బారిన పడుతోంది. ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల ఎమ్మార్పీ ధరల కంటే 15 నుండి 20 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ విక్రయాలు సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్నాయి. సంక్షేమ పథకాలకు అవసరమైన నిధుల కోసం మద్యం అమ్మకాలపైనే ఆధారపడటం ప్రజా శ్రేయస్సుకు విఘాతంగా మారుతోంది. ఆదాయం పెరుగుతున్న కొద్దీ కుటుంబాల్లో కలహాలు, ఆరోగ్య సమస్యలు మరింతగా పెరుగుతున్నాయి.



# రాజేంద్రనగర్‌లో అభివృద్ధి జోరు

- **రూ. 2.43 కోట్ల పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో పలు కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు గాను భారీ స్థాయిలో పనులు ప్రారంభమయ్యాయి. మొత్తం రూ. 2.43 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులకు ఎమ్మెల్యే ఘనంగా శ్రీకారం చుట్టారు. డివిజన్ 121 పరిధిలో తిరుమల గార్డెన్‌లో రూ. 44 లక్షలతో వీడీసీసీ రోడ్లు, పద్మశ్రీ హిల్స్‌లో రూ. 36 లక్షలతో యుజిడి మరియు రోడ్లు, నర్సారెడ్డి కాలనీలో రూ. 49 లక్షలతో రోడ్లు, డాక్టర్స్ కాలనీలో రూ. 30 లక్షలతో డ్రైనేజీ, పి & టి కాలనీ బి బ్లాక్‌లో రూ. 46 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇదే క్రమంలో డివిజన్ 123లోని శివగంగ కాలనీలో రూ. 38 లక్షలతో రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల్లో సంవత్సరాలుగా నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలను బలోపేతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పనుల అమలులో ఆలస్యం లేదా నాణ్యత లోపం అసలు సహించబోమని అధికారులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అన్ని పనులను నిర్దేశిత గడువులో, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్న ఎమ్మెల్యే, అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌లో అభివృద్ధి పనులు ఊపందుకోవడంతో, ఈ వేగం ఎంతవరకు కొనసాగుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికర చర్చగా మారింది.

## పేకాట స్థావరంపై దాడి

- **పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట్ మండలం చిమ్రజ్ పల్లి గ్రామ శివారులోని సురేష్ నగర్ కాలనీలో శనివారం పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో నందిపేట్ ఎస్ ఐ కే. వినయ్ కుమార్ ఆధ్వర్యంలో స్థావరం పై దాడి చేయగా, 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 28,140 మరియు 7 మొబైల్ ఫోన్లను రెండు బైకులను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు. నందిపేట్, డొంకేశ్వర్ మండలాలలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మైనార్టీ గురుకులంలో 5వ తరగతి ప్రవేశాలకు అవకాశం

- **నేటితో దరఖాస్తుల గడువు ముగింపు – అర్హులైన విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి : ప్రిన్సిపాల్ సంగమేశ్వర్**




**విశాల భారతి , అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్‌లో కొనసాగుతున్న తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ (అంబర్‌పేట బాయ్స్-1)లో 5వ తరగతి ప్రవేశాల కోసం సీట్లు అందుబాటులో ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ ఈ. సంగమేశ్వర్ తెలిపారు. మైనార్టీ, నాన్‌మైనారిటీ విద్యార్థులకు ఈ ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో నాణ్యమైన విద్యతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం, ఆధునిక సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని వసతులు గురుకులంలో కల్పించబడుతున్నాయని తెలిపారు. ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు అవసరమైన ధృవపత్రాలతో కలిసి నేటి (జూన్ 14)లోపు నేరుగా పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ సంగమేశ్వర్ కోరారు. పూర్తి వివరాల కోసం 79950 57997 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ప్రైవేట్ స్కూల్ దోపిడీని అరికట్టాలి

- **పల్లె మురళి గౌడ్**
- **మియాపూర్ ఎంఎన్ఆర్ పాఠశాల ముందు అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ నిరసన**



**ఎంఎన్ఆర్ స్కూల్ ముందు నిరసన తెలియజేస్తున్న అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ నాయకులు**

**సైబరాబాద్ విశాల భారతి ;** ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తుల బలవంతపు అమ్మకాలు, అధిక రుసుములు, ఆలస్య రుసుముల వసూళ్లను వ్యతిరేకిస్తూ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈరోజు మియాపూర్ హెచ్ఎంటి స్వర్ణపురి ఎంఎన్ఆర్ పాఠశాల ముందు నిరసన జరిగింది. ఫీజు ఆలస్యంగా చెల్లించినందుకు తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఆలస్య రుసుము పేరుతో వసూలు చేస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు వసూలు చేసిన ఆలస్య రుసుములు తిరిగి ఇప్పించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ నెల ఇరవై ఆరో తేదీన జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేయగా, జిల్లా విద్యాధికారి శేరిలింగంపల్లి మండల విద్యాధికారికి విచారణ ఆదేశించారు. నోటీసులు జారీ అయినా ఇప్పటివరకు విచారణ జరగలేదని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి ఎంఎన్ఆర్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో దుర్గాప్రసాద్, జేడీ గణేష్, మన్నె నరేంద్ర ముదిరాజ్, రాజు యమలవలస, పవన్, జగదీష్‌తోపాటు విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో కర్ణాటక గాత్ర, కూచిపూడి ప్రదర్శనలు



**సైబరాబాద్ విశాల భారతి ;** మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కర్ణాటక గాత్ర కళాకారిణి మనోజ మాధురి తన బృందంతో కలిసి కచేరీ ఇచ్చారు. సిద్ధివినాయకం, గోపాల పాహిమాం, దేవ ర్ణమా, బృందావన తిల్లాన కీర్తనలను ఆలపించారు. ప్రేక్షకులు చప్పట్లతో అభినందించారు. అనంతరం స్వాతి రెడ్డి శశిహేయ్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేసింది. రాజేశ్వరి అష్టకం, హిందోళ తిల్లాన, శ్రీహరి స్తోత్రం, ధనుశ్రీ తిల్లాన, అన్నమాచార్య కీర్తన, గణేశ పంచరత్నం, పుష్పాంజలి, నటన మనోహర అంశాలను నామాస్వి, లౌక్య, జాన్విక, హంవీక, వీణ, వైష్ణవి, శ్రీకరీ, గమన తదితర కళాకారులు ప్రదర్శించారు. ది డాన్స్ ఇండియా మ్యాగజిన్ ఎడిటర్ ఇన్ చీఫ్ విక్రమ్ కుమార్, డాక్టర్ కళా కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను అభినందించారు. శిల్పారామం మాదాపూర్‌లో ప్రతి శని, ఆదివారం ఉచిత సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

## షాబాద్ ప్రభుత్వ పాఠశాలకు 50 ఏళ్లు పూర్తి

- **2000 మంది పూర్వ విద్యార్థులతో మహా సమ్మేళనం**

**చేవెళ్ల, విశాలభారతి :** చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 50 సంవత్సరాల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించారు. 1975 నుంచి 2025 వరకు ఈ పాఠశాలలో పదో తరగతి చదివిన సుమారు 2000 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని బాల్యస్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాల నడుమ వేడుకలను జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అరుదైన రీతిలో నిర్వహించిన ఈ మహాసమ్మేళనం అందరి ప్రశంసలను అందుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి హాజరై పాఠశాలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందించిన సుమారు 60 నుంచి 70 మంది మాజీ, ప్రస్తుత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల నుంచి విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రస్తుతం ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, ఆర్టీసీ ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బంది, వ్యాపారవేత్తలుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకుని తమ బాల్య అనుభవాలు, పాఠశాల జ్ఞాపకాలను పంచుకోవడంతో కార్యక్రమం భావోద్వేగభరితంగా సాగింది. వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, ప్రముఖులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. పాఠశాల 50 ఏళ్ల చరిత్రను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం షాబాద్ గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.




## ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ శక్తి ప్రదర్శనకు సిద్ధం..!

- **ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమావేశాన్ని విజయవంతం చేయండి – గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులకు బింగి దేవదాస్ గౌడ్ పిలుపు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బూత్ లెవల్ ఏజెంట్ల (BLA) శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్ కోరారు. ఆదివారం (జూన్ 14) ఉదయం 10 గంటలకు బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ప్రమిద కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని బ్లాక్, మండల, మున్సిపల్, డివిజన్ అధ్యక్షులు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ శ్రేణులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బింగి దేవదాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలి అని ఆయన పిలుపునిచ్చారు.

## హలో ఉద్యమకారుడా.. చలో డిండి చింతపల్లి



- **పోస్టర్ ఆవిష్కరణ**

**తిరుమలగిరి, విశాలభారతి :** తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ రెహమాన్ ఆధ్వర్యంలో తిరుమలగిరిలో చలో డిండి చింత పల్లి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి కోతి మాధవి మాట్లాడుతూ ఈ నెల 21న నాగర్ కర్నూల్ జిల్లా డిండి చింతపల్లిలో తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం ఆవిష్కరణ సభ ఉంటుందని తెలిపారు. ప్రతీ ఉద్యమకారుడు ఈ సభలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు. తెలంగాణ కోసం ఎంతో మంది వీరులు నేలకొరిగారని, వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కే రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు ఏలూరు బాబు, సహాయకార్యదర్శి జే విష్ణు, కూరపాటి శ్రీను, బైరబోయినవెంకన్న, షాంద్ పాషా, సామాజిక తెలంగాణ మహాసభ అధ్యక్షులు కొత్తగట్టు మల్లయ్య సామాజిక ఉద్యమకారుడు కందుకూరి ప్రవీణ్ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుకూరు సోమన్న సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటీ కరుణాకర్ , బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రబు, చేను శ్రీనివాస్ జై భారత్ నాయకులు దుస్సా మూర్తి , ఫతేపురం యాదగిరి, టి యు జేఏసీ నాయకులు ఎర్రబెల్లి వెంకన్న కందుకూరి మహేష్

రజక సంఘం మండల శాఖ అధ్యక్షులు పులిమామిడి సోమన్న, పులిమామిడి భిక్ష0, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు బన్వరి నరసయ్య, సిపిఎం నాయకులు పానుగంటి శ్రీనివాస్, పాలబిందెల మహేష్ ,ఈదునూరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు

## గర్భిణుల ప్రాణాలతో చెలగాటం..!






- **నాగోల్‌లో అక్రమ అబార్షన్ రాకెట్ బట్టబయలు – డెకాయ్ ఆపరేషన్‌తో ఇద్దరి అరెస్ట్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపురి కాలనీలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో అక్రమంగా గర్భస్రావాలు నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్ ద్వారా బట్టబయలు చేశారు. మహిళల ఆరోగ్యాన్ని, ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే ఈ అక్రమ వ్యవహారంపై నాగోల్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టి ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మక్బుల్ జానీ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. జైపురి కాలనీ రోడ్ నంబర్ 2లో "కేసరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్" పేరుతో నిర్వహిస్తున్న కేంద్రంలో అక్రమంగా అబార్షన్లు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ బృందం, నాగోల్ పోలీసులు సంయుక్తంగా డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణీ మహిళగా మహిళా కానిస్టేబుల్‌ను పంపగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న వీర రేవతి (50) ఎలాంటి వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండానే గర్భస్రావం చేసేందుకు సిద్ధమైనట్లు గుర్తించారు. మహిళా కానిస్టేబుల్ వద్ద నుంచి రూ. 10 వేల నగదు తీసుకుని ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అనంతరం అబార్షన్‌కు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో పోలీసు బృందం దాడి చేసి నిందితులను పట్టుకుంది. విచారణలో గర్భిణీలను స్కానింగ్ కేంద్రాలకు పంపించి, అక్కడి నివేదికల ఆధారంగా అక్రమంగా గర్భస్రావాలు నిర్వహిస్తున్నట్లు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. దాడిలో వైద్య పరికరాలు, మందులు, రికార్డులు సహా కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, కేంద్ర నిర్వాహకురాలు బండారు వెంకట లక్ష్మి మరియు వీర రేవతిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ మక్బుల్ జానీ వెల్లడించారు. ప్రజలు కేవలం ప్రభుత్వ అనుమతులు పొందిన ఆసుపత్రులు, అర్హత కలిగిన వైద్యులను మాత్రమే సంప్రదించాలని, ఇలాంటి అక్రమ కేంద్రాలను ఆశ్రయించి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని ఆయన సూచించారు. అక్రమ వైద్య కేంద్రాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## హలో నిరుద్యోగి... ఛలో కొత్తపేట..!

- **నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారమే లక్ష్యం**
- **జూన్ 16న యువ సమ్మేళనం – సీపీఎం**




**విశాలభారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** నిరుద్యోగ యువత సమస్యలపై ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించేందుకు ఈ నెల 16న కొత్తపేటలో నిర్వహించనున్న యువ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సీపీఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి ఈ. నర్సింహ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ ప్రజాసంఘాల కార్యాలయంలో యువ సమ్మేళనానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరతపై ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్పందించడం లేదని ఆరోపించారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు యువతలో చైతన్యం నింపేందుకు యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు స్పష్టమైన ఉద్యోగ విధానాన్ని ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుండె శివకుమార్, బాలరాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మానవ హక్కులుఆర్టీఐ కౌన్సిల్ నూతన కార్యాలయం ప్రారంభం




**విశాలభారతి, మణుగూరు :** జాతీయ మానవ హక్కులుఆర్టీఐ కౌన్సిల్ నూతన కార్యాలయాన్ని పినపాక మణుగూరు మండలం సరిహద్దు ప్రాంతం చిక్కుడు గుంట గ్రామంలో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఎదురుగా శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జర్నలిస్ట్ సంఘం నాయకుల చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభింపజేశారు. అనంతరం మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలందిస్తున్న పలువురిని శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల హక్కుల పరిరక్షణ, సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడం, బాధితులకు న్యాయం అందించడంలో జాతీయ మానవ హక్కులుఆర్టీఐ కౌన్సిల్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మానవ హక్కులపై అవగాహన పెంచడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రజల హక్కులకు భంగం కలిగిన సందర్భాల్లో బాధితులకు చట్టపరమైన సహాయం అందించడంతో పాటు, సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొనేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు బందా సతీష్ , కట్ల ప్రణయ్ కుమార్, కుంజ గణేష్, కాసినేడి బలరామకృష్ణ, సూరే పల్లి ధనుంజయరావు, ప్రవీన్, జర్నలిస్ట్ లు బిల్లా నాగేందర్, శ్రీరామ్ బృహస్పతి, సాంబశివరావు, సాయి ప్రవీణ్, పలువురు జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## జిమ్స్ హాస్పిటల్ రక్తదాన శిబిరం ఘన విజయం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** సమాజంలో రక్త కొరతను తగ్గించి, అత్యవసర సమయాల్లో రోగుల ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో జిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విశేషంగా విజయవంతమైంది. శ్రీ చిన్న జీయర్ స్వామీజీ మంగళశాసనంతో నిర్వహించిన ఈ శిబిరం సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక శిబిరంలో 'జీవ ఆశ్రమం' సంస్థకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తమ బాధ్యతను గుర్తించిన వారు సమాజానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటిచెప్పారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ జిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం అభినందిస్తూ ప్రశంసా పత్రాలు (సర్టిఫికేట్లు) మరియు పండ్లను అందజేసింది. ఈ కార్యక్రమం ద్వారా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, మరింత మంది ముందుకు రావాలనే సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, "ఒక్క చుక్క రక్తం అనేక ప్రాణాలను కాపాడగలదు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.

## కేటీఆర్, హరీష్ రావులను కలిసిన బీఆర్ఎస్ నేత

- **శుభాకాంక్షలు తెలిపిన సంతోష్ ముదిరాజ్**



**హరీష్ రావు కేటీఆర్ లను కలిసిన సంతోష్ ముదిరాజ్.**

**సైబరాబాద్ విశాల భారతి;** విదేశీ పర్యటన విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులను శేరిలింగంపల్లి కొండాపూర్ డివిజన్ సీనియర్ నేత సంతోష్‌ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో, హరీష్ రావు నివాసంలో జరిగిన భేటీలో సంతోష్ ముదిరాజ్ పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శేరిలింగంపల్లిలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, స్థానిక సమస్యలు, రాజకీయ పరిణామాలపై చర్చించారు. కేసీఆర్ ఆశయాల సాధనకు, కేటీఆర్ నాయకత్వంలో కార్యకర్తలతో కలిసి పార్టీని మరింత బలోపేతం చేస్తాం" అని సంతోష్ ముదిరాజ్ పేర్కొన్నారు.

## 188 వారాలు పూర్తి చేసుకున్న హోప్ ఫౌండేషన్ అన్నదానం

- చందానగర్‌లో ప్రతి శనివారం వేల మందికి అన్నప్రసాదం
- లాక్‌డౌన్‌లోనూ ఆగని సేవా కార్యక్రమం



**హోప్ ఫౌండేషన్‌ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం**

**సైబరాబాద్ విశాల భారతి;** ఆకలి తీర్చడం అత్యున్నత సేవ అనే మాటకు హోప్ ఫౌండేషన్ అక్షరాలా రూపం ఇస్తోంది. చందానగర్‌లో గత మూడున్నరేళ్లుగా ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 188వ వారాన్ని పూర్తి చేసుకుంది. శనివారం కూడా వేలాది మంది అన్నార్తులకు రుచికరమైన భోజనం వడ్డించారు.2018 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పటి వరకు ఒక్క వారం కూడా ఆగలేదు. కరోనా లాక్‌డౌన్ సమయంలో రవాణా స్తంభించినా, నిబంధనల మధ్య వలస కూలీలు, రోడ్డుపై జీవించే వారికి అన్నం అందించారు. ఎండ, వాన, చలి ఏదైనా సరే శనివారం రాగానే చందానగర్‌లో వంట మొదలవుతుంది.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఘాలి కృష్ణ, అపర్ణ, అన్నె సందీప్‌తో పాటు వందలాది మంది వాలంటీర్లు పాల్గొంటారు. వచ్చిన వారందరికీ కుల, మత, ప్రాంత వివక్ష లేకుండా భోజనం పెడతారు. ఇంతమంది వచ్చినా క్రమశిక్షణ, పరిశుభ్రత పాటిస్తారు. వడ్డన నుంచి ప్లేట్లు తొలగించడం వరకు అన్నీ క్రమపద్ధతిలో జరుగుతాయి."మేం చేస్తున్నది పెద్ద సేవ కాదు. ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం మనిషి బాధ్యత. ఆ బాధ్యతను హోప్ ఫౌండేషన్ ద్వారా నెరవేరుస్తున్నాం. వచ్చిన వారి ముఖంలో కనిపించే తృప్తే మాకు ఇచ్చే బహుమతి" అని నిర్వాహకుడు ఘాలి కృష్ణ తెలిపారు.చందానగర్‌లో మొదలైన ఈ సేవ ఇప్పుడు మియాపూర్, హాఫీజ్ పేట, కొండాపూర్ వరకు విస్తరించింది. 188 వారాల్లో లక్షలాది మంది ఆకలి తీరింది. ఈ మానవతా యజ్ఞం ఇంకా కొనసాగుతుందని, 200 వారాల మైలురాయిని త్వరలో చేరుకుంటుందని నిర్వాహకులు చెప్పారు.

## బండ్ పేపర్ లేక ప్రజలు అవస్థలు



**మోత్కూరు, విశాల భారతి :** మోత్కూరు మున్సిపల్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత రెండు నెలల నుంచి బండ్ పేపర్ లేక మున్సిపల్ , మోత్కూరు మండలానికి అనుసంధానంగా ఉన్న ఆత్మకూరు (ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బారాస యువజన విభాగం రాష్ట నాయకులు చొల్లేటి నరేష్ అన్నారు.శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ బండ్ పేపర్లు లేక వివిధ భూములు,పాట్లు కొనుగోలు చేయాలన్నా, అమ్ముకోవాలన్నా ఈ పేపర్లే కీలకంగా మారాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా, అధికారులు వెంటనే స్పందించి బాండ్ పేపర్లు ఇక్కడ అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్ష



**ఆలేరు, విశాల భారతి:** ఆలేరు మండల సబ్ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్‌ను ఆలేరు మండలం గుండ్లగూడ గ్రామానికి చెందిన టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపల విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల కాలంలో ఆలేరు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎస్ఐ వినయ్ కుమార్ సేవలను ఈ సందర్భంగా నాయకులు అభినందించారు.ఈ సందర్భంగా గంపల విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వినయ్ కుమార్ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ఎస్ఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలను మరింత సమర్థవంతంగా నిర్వహించగలమని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, ప్రభాకర్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు పాల్గొని ఎస్ఐ వినయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## సింగన్నగూడెం 2బీహెచ్‌కే కాలనీలో పెండింగ్ పనులనుపరిశీలించిన ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి:** జిల్లాలోని భువనగిరి మండలం సింగన్నగూడెం 2బీహెచ్‌కే కాలనీలో కొనసాగుతున్న పెండింగ్ పనులను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, అంతర్గత రహదారులు తదితర మౌలిక వసతుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవాణి రవికుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల ధరలను పెంచి వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్న మోడీ ప్రభుత్వం: గౌని ఐలయ్య




**బయ్యారం విశాల భారతి:** ఎరువులపై ఇప్పటి వరకు ఇస్తున్న సబ్సిడీని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవటం వలన వాటి ధరలు భారీగా పెరిగాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. పంటలకు మద్దతు ధర లభించక, పంటలను కొనే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతాంగంపై ఎరువుల ధరలు పెరుగుదల పెను భారంగా మారనున్నదని ఆయన అన్నారు. ఎరువుల ధరల పెరుగుదలకు నిరసనగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఈరోజు బయ్యారం బస్టాండ్ సెంటర్లో జరిగిన ధర్నా నుద్దేశించి ఆయన ప్రసంగించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతుల పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఆచరణలో వారికి మొండి చేయి చూపించిందని మాటల్లో రైతు జపం చేస్తూ ఆచరణలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే చర్యలకు పూనుకున్నదని ఆయన విమర్శించారు. వ్యవసాయ దిగుమతులపై సుంకాలు తగ్గించడంతో మన దేశంలోకి వ్యవసాయ ఉత్పత్తులు భారీ ఎత్తున దిగుమతి అవుతున్నాయని, తద్వారా అర కొరగా ఇస్తున్న మద్దతు ధరలకు కూడా రైతు పండించిన పంటను కొనే నాథుడు కరువయ్యాడని, మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు రైతులు తమ పంటలను ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే దేశంలో ప్రతి 30 నిమిషాలకు రైతు అప్పుల బారినబడి ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఇప్పుడు ఎరువుల భారం పెరగడంతో రైతుల తలపై పిడుగు పడినట్లు అయిందని ఆయన అన్నారు. ఎరువులకు ఇచ్చే సబ్సిడీలను కొనసాగించాలని, పెంచిన ఎరువుల ధరలను తగ్గించి కొరత లేకుండా అవసరమైనన్ని ఎరువులను రైతాంగానికి సరఫరా చేయాలని ఐలయ్య డిమాండ్ చేశారు. ధర్నాకు ముందు గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రం నుండి బయ్యారం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్, ఇతర ప్రజాసంఘాల నాయకులు తోకల వెంకన్న,మోకాళ్ళ మురళీకృష్ణ,మైల యాకన్న,తుడుం వీరభద్రం, నేతకాని రాకేష్,రామగిరి బిక్షం,బానోత్ నర్సింహా,మెంగు భగవాన్,ధారావత్ మంగీలాల్,పూనెం లింగన్న,గంగారపు బిక్షం, నూతక్కి భూషణ్ రావు, వీరబోయిన ఐలయ్య, సజ్జ జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్లు కూల్చడానికే సర్పంచ్‌గా గెలిచారా..?

- కనకమామిడిలో ఉద్రిక్తత.. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం
- తహసీల్దార్ ,సర్పంచ్ భర్త చర్యలపై మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం ఫైర్
- కోట్ల భూముల కబ్జాలు కనిపించవా.. పేదల ఇండ్లే కనిపిస్తున్నాయా?
- ఆర్డీవో తో ఫోన్‌లో మాట్లాడి ఎకపక్ష చర్యలపై అభ్యంతరం
- పేదల కన్నీటి శాపం మంచిది కాదు, ఉసురు తగిలి సర్వనాశనం అవుతారు
- కనకమామిడి కమ్మని చరిత్రను మీ రాజకీయాల కోసం కంపుగా చేయొద్దు
- కుట్రలను తిప్పికొట్టేందుకు గ్రామస్తులంతా ఏకం కావాలని పిలుపు
- ఇంట్లాంటి కుట్రపూరిత చర్యలు ఇట్లనే కొనసాగితే.. పరిణామాలు సీరియస్‌గా ఉంటాయి
- పేదలకు అండగా బీజేపీ ఉంటుందని మాజీ చేవెళ్ల ఎమ్మెల్యే కే.ఎస్ రత్నం భరోసా





**మొయినాబాద్ విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.గ్రామానికి చేరుకున్న స్థానిక తహసీల్దార్ గౌతమ్ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ప్రజలకు కనీస సమాచారం అందించకుండా పేదలు నిర్మించుకున్న ఇండ్లపై సెలెక్టివ్ కూల్చివేత చర్యలకు సిద్ధమవడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. దీంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతుండగా, గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం శనివారం ఉదయమే హుటాహుటిన గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. పేదల ఇండ్లపై అధికారులు చూపిస్తున్న అత్యుత్సాహంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, గ్రామంలో కోట్ల రూపాయల విలువ చేసే భూములు కబ్జాలకు గురైతే కన్నెత్తి చూడరు..కానీ కష్టపడి వ్యవసాయం చేసుకుంటూ జీవించే పేదల ఇండ్లు మాత్రం కనిపిస్తున్నాయా? అంటూ తీవ్రంగా మండిపడ్డారు.వాస్తవానికి గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లే ఈ రహదారి చాలా విశాలంగా ఉందని, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండానే ప్రజలు దశాబ్దాలుగా వినియోగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఎలాంటి నోటీసులు లేకుండా ఒక్కసారిగా కూల్చివేతలకు దిగడం అధికారులు, సర్పంచ్ భర్త కక్షసాధింపు ధోరణికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. అధికారుల చర్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితుల్లో కొందరు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా, స్థానికులు అప్రమత్తమై అడ్డుకోవడంతో తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఈ ఘటనను చూసిన కే.ఎస్. రత్నం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పేదల గుండెల్లో మంట పెట్టే నిర్ణయాలు తీసుకుంటే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఫోన్ ద్వారా సంబంధిత ఆర్‌డీఓతో మాట్లాడిన ఆయన, ఎలాంటి ఎకపక్ష చర్యలకు పాల్పడకుండా చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా వ్యవహరించాలని కోరారు. రహదారి ఆక్రమణ జరిగి ఉంటే అందరికీ ఒకే న్యాయం చేయాలని, కనకమామిడి గేట్ నుంచి వెంకటాపూర్ వరకు రహదారిపై ఉన్న ప్రతి ఆక్రమణను తొలగించిన తర్వాతే పేదల ఇండ్లపై చర్యల గురించి మాట్లాడాలని స్పష్టం చేశారు.పెద్దల వద్ద నుంచి వచ్చే లంచాలకు అలవాటు పడి పేదలపై ప్రతాపం చూపిస్తే ప్రజలు సహించరని, చట్టం పేరుతో బలహీనులపై దౌర్జన్యం చేయడం సరికాదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. కనకమామిడి గ్రామానికి ఉన్న మంచి పేరు, చరిత్రను కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం చెడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పేదల సమస్యల వద్ద నిలబడి న్యాయం చేయాల్సిన వారు, వారికే ఇబ్బందులు సృష్టించే కుట్రల్లో భాగమవడం సిగ్గుచేటని పేర్కొంటూ గ్రామ సర్పంచ్ భర్త వ్యవహారశైలిపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు గ్రామస్తులంతా ఒక్కతాటిపైకి రావాలని, అన్యాయానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. పేదల కన్నీటి శాపం ఎవరికీ మంచిది కాదని, నిరుపేదల ఉసురు తగిలితే ఎవరూ బాగుపడరని హెచ్చరించిన కే.ఎస్. రత్నం, ఇలాంటి చర్యలు కొనసాగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని సీరియస్ స్పష్టం చేశారు. పేదలకు ఎలాంటి అన్యాయం జరిగినా భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే జెండా పాతి ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రకటిస్తూ గ్రామ ప్రజలకు భరోసా కల్పించారు. పేదల ఇండ్లను కూల్చే ముందు వారి గుండెల్లో ఉన్న బాధను అర్థం చేసుకోండి.. లేకపోతే ప్రజల తీర్పు చాలా కఠినంగా ఉంటుంది అని మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు.

## వర్షంలోనూ ప్రజాసేవలో సైబరాబాద్ పోలీసులు



**వర్షంలో ట్రాఫిక్ జామ్ కాకుండా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు**

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు సహాయంతో అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది

**సైబరాబాద్ విశాల భారతి;** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈరోజు ఉదయం నుంచి కురుస్తున్న ఏడతెరిపిలేని వర్షాల కారణంగా ప్రజా జీవనం అస్తవ్యస్తం కాకుండా పోలీసు శాఖ అన్ని విభాగాలు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నాయి. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది రోడ్లపై మోహరించి ప్రజలకు సహాయం అందిస్తున్నారు.

**ట్రాఫిక్ పోలీసుల విధులు:**

వర్షం వల్ల దృశ్యమానత తగ్గి, రోడ్లపై నీరు నిలవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు ప్రధాన కూడళ్లు, బిజీ రోడ్లు, ఐటీ కారిడార్, ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ పాయింట్లు, మియాపూర్, కూకట్‌పల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తున్నారు. లోతట్టు ప్రాంతాలు, ఫ్లైఓవర్ల కింద, అండర్‌పాస్‌ల వద్ద నీరు నిలిచిన చోట్ల వాహనదారులను ముందుగానే మళ్లిస్తూ ప్రమాదాలను నివారిస్తున్నారు. బ్రేక్‌డౌన్ అయిన వాహనాలను వెంటనే పక్కకు తరలించి ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. టోయింగ్ వాహనాలు కూడా అందుబాటులో ఉంచారు.

**లా అండ్ ఆర్డర్ సిబ్బంది సహాయం:**

వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులు, మహిళలు, పిల్లలకు లా అండ్ ఆర్డర్ సిబ్బంది సహాయం అందిస్తున్నారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో నిలబడి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నీరు నిలిచి ప్రమాదం ఉందని గుర్తించి బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. కూలిన చెట్లు, విరిగిన కొమ్మలను తొలగించే పనిలో సీఎంసీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటున్నారు.

వర్షపు నీటితో నిండిన కాలువలు, నాల వద్ద ప్రజలను ఆపి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తక్షణమే స్పందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రెస్క్యూ బృందాలు అప్రమత్తంగా ఉన్నాయి.

**పోలీస్ కమిషనర్ ఆదేశాలు:**

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని జోన్ల డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఫీల్డ్‌లో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక మానిటరింగ్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందిస్తున్నారు.



**వర్షపు నీరు నిలవకుండా నాలా వద్ద చర్యలు చేపడుతున్న లాండ్ ఆర్డర్ పోలీసులు**



**సిగ్నల్ వద్ద వర్షంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది**

**ప్రజలకు విజ్ఞప్తి:**

1. అవసరం లేనిదే ఇంటి నుంచి బయటకు రావద్దు. ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ అవకాశం ఉంటే వినియోగించుకోవాలి.
2. వాహనదారులు వేగంగా నడపకుండా, హెడ్‌లైట్లు వేసి జాగ్రత్తగా డ్రైవ్ చేయాలి.
3. లోతట్టు ప్రాంతాలు, అండర్‌పాస్‌లు, నాల వద్దకు వెళ్లవద్దు.
4. రోడ్డుపై నీరు నిలిచిన చోట వాహనం నడిపేటప్పుడు ఇంజిన్ ఆఫ్ అయ్యే ప్రమాదం ఉంది, జాగ్రత్త వహించాలి.
5. ట్రాఫిక్ పోలీసులు, వాలంటీర్లు ఇచ్చే సూచనలు, డైవర్షన్లను తప్పనిసరిగా పాటించాలి.
6. ఏదైనా అత్యవసర సహాయం కావాలంటే 100, ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626 నంబర్లకు కాల్ చేయాలి.

ప్రజల భద్రత, సురక్షిత ప్రయాణమే ధ్యేయంగా సైబరాబాద్ పోలీసులు వర్షం తగ్గే వరకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు.

## అనారోగ్యంతో ఉన్న కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షుడిని పరామర్శించిన మున్సిపల్ వైస్ చైర్మన్



**ఆలేరు, విశాల భారతి:** ఆలేరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు ఇటీవల అనారోగ్యానికి గురైన నేపథ్యంలో, ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు శనివారం వారి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంగడి ఆంజనేయులు మాట్లాడుతూ, పార్టీ కోసం ఎంతోకాలంగా సేవలందించిన నాయకుల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని అన్నారు. కష్టసుఖాల్లో పరస్పరం అండగా నిలవడం రాజకీయ నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాయకుడికి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమం పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న ఆత్మీయతను, పరస్పర అనుబంధాన్ని ప్రతిబింబించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. నాయకుల ఆరోగ్య సంక్షేమం పట్ల పార్టీ శ్రేణులు చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మల్లెల శ్రీకాంత్, వట్టిపెల్లి శ్రీనివాస్, పార్షనరేష్ తదితరులు పాల్గొన్నారు.

## షాదీ ముబారక్‌లో షాకింగ్ స్కామ్

- నకిలీ పత్రాలతో రూ.21 లక్షలు కాజేసిన ముఠా అరెస్ట్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** షాదీ ముబారక్ పథకాన్ని దుర్వినియోగం చేస్తూ నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వాన్నిసుమారు రూ.21 లక్షలు మోసం చేసిన ముఠాను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మహమ్మద్ ఎతిమాద్ ఉల్ హక్ (25), మహమ్మద్ అక్బర్ (20), సయ్యద్ ముషరఫ్ ఉద్దీన్ (23), మొహమ్మద్ సర్ఫరాజ్ (26), మొహమ్మద్ జాఫర్ (23) మరియు ధారావత్ అశోక్ కిరణ్ (32) కలిసి ఈ మోసానికి పాల్పడ్డారు. హసన్ నగర్ ప్రాంతంలోని ఫాతిమా కాలనీలో నివసిస్తున్న ఎతిమాద్ తన ఇంటిని కేంద్రంగా చేసుకుని కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ల సహాయంతో వధువుల ఫోటోలు, ఆధార్ వివరాలు, వివాహ ధృవపత్రాలు వంటి పత్రాలను మార్పులు చేసి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసినట్లు విచారణలో బయటపడింది. నకిలీ దరఖాస్తులను మహమ్మద్ అక్బర్ సేకరించి, బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించేందుకు చర్యలు తీసుకున్నాడు. మిగతా నిందితులు ముషరఫ్, సర్ఫరాజ్, జాఫర్ లు నకిలీ లబ్ధిదారులను గుర్తించి, వారికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు, విద్యుత్ బిల్లులు మరియు ఇతర పత్రాలను సేకరించడం లేదా నకిలీగా తయారు చేయడంలో సహకరించారు. అలాగే బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అశోక్ కిరణ్, సరైన ఫీల్డ్ వెరిఫికేషన్ లేకుండా ఈ దరఖాస్తులను ముందుకు పంపించడంలో సహకరించినట్లు పోలీసులు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు దాడి నిర్వహించి ఆసుస్ ల్యాప్‌టాప్, హెచ్‌పీ సీపీయూ, డెస్క్‌టాప్ కంప్యూటర్, ఆరు మొబైల్ ఫోన్లు, నకిలీ దరఖాస్తులు మరియు సుమారు రూ.21 లక్షల విలువైన చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా షాదీ ముబారక్ పథకం ద్వారా ప్రభుత్వాన్ని సుమారు రూ.21 లక్షలు మోసం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నారు.

## జూన్ నెలాఖరులోపు పీఆర్సీ ప్రకటించాలి

- టీఎస్యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె. యాకయ్య డిమాండ్




**యాదాద్రి భువనగిరి, విశాలాభారతి:** ప్రభుత్వం జూన్ నెలాఖరులోపు పీఆర్సీ నివేదికను ఆమోదించి ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్యూటీఎఫ్) రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె. యాకయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాఠశాలల కుదింపు చర్యలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జులై నెలలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, ఉపాధ్యక్షురాలు కె. మమత, కోశాధికారి బి. ముత్యాలు, జిల్లా కార్యదర్శులు, మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ.. క్యూలైన్లలో బారులు భక్తులు



**యాదగిరిగుట్ట, విశాలాభారతి:** శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వారాంతపు సెలవు దినం కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి ధర్మదర్శనానికి (ఉచిత దర్శనం) దాదాపు 2 గంటల సమయం పడుతుండగా, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పడుతోంది. ఆలయ పరిసరాలైన ప్రసాద విక్రయశాల, కొండపైకి వెళ్లే మెట్ల దారి, లక్ష్మీ పుష్కరిణి, వ్రత మండపాలు భక్తులతో సందడిగా మారాయి. వామివారి ఒక్కరోజు ఆదాయం 45,30,856 వచ్చిందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో ఐఏఎస్ అధికారి భవాని శంకర్ డిప్యూటీ ఈవో నవీన్ శర్మ తెలిపారు.

## మునుగోడులో భారీ వర్షం నిలిచిపోయిన రాకపోకలు



**మునుగోడు విశాల భారతి ;** మునుగోడు మండలంలోని కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది మర్రి వాగు ఉప్పొంగడంతో మునుగోడు చండూరు, చౌటుప్పల్ రహదారులపై వరద నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి బుడిగ జంగాల కాలనీని వరద ముంచెత్తడంతో నాలుగు కుటుంబాలకు చెందిన సుమారు రూ.2 లక్షల విలువైన ప్లాస్టిక్ సామాగ్రి నీటిపాలైంది లో తట్టు ప్రాంతాలు జలమయం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



# తన పేరుతో సైబర్ మోసాలు

'లక్కీ భాస్కర్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక మీనాక్షి చౌదరి తాజాగా ఒక పెద్ద సైబర్ మోసంపై స్పందించారు. తన పేరుతో కొందరు కేటుగాళ్లు ప్రజలను, అభిమానులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె గుర్తించారు. తనలా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా బయటపెడుతూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు నకిలీ వ్యక్తి వాడుతున్న ఫోన్ నంబర్‌ను స్క్రీన్ షాట్ తీసి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మీనాక్షి పోస్ట్ చేశారు. ఈ నంబర్ నుండి ఎవరికైనా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలని కోరారు. అది తన నంబర్ కాదని స్పష్టం చేసిన ఆమె, ఈ మోసాన్ని సకాలంలో గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చిన నెటిజన్లకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఇక సినిమాల విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. అందులో ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న 'వృషకర్మ' చిత్రంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ దండు దర్శకత్వంలో మైథలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.